కథా నిలయం



# మైత్రాలాపం

— కె. గోదావరిశర్మ

"అదిగో చూడు—ఆ బ్లూ షర్ట్.. వెళ్ళిపోతున్నాడు... అదిగో కూర్చున్నాడు ఆ కుర్చీలో...."

"ఊఁ- చూశాను. ఎవరతను?"

"ఏమో! నాకూ తెలియదు. బాగున్నాడు కదూ? హాండ్‌సమ్‌గా లేడూ?"

మిత్రుడి వైపు తీక్షణంగా చూశాడు సుందర్రావు. "మనిషికి రెండే కళ్ళు, రోజుకి 24 గంటలే ఇచ్చాడు దేవుడు. అందమైన ఆడ పిల్లలని చూడడానికే అవి చాలవని నేను బాధపడుతూంటే నువ్వెక్కడ దొరికావురా బాబూ, మగవాళ్ళని చూడమంటావు? టైమ్ వేస్ట్" అన్నాడు సీరియస్‌గా.

మోహన్రావు ముఖ భంగిమ ఏమీ మారలేదు. "హాండ్సమ్‌గా ఉన్నాడా—లేడా అనడిగాను. దట్సాల్! ఆన్సర్ టు ది పాయింట్" అన్నాడు యమ సీరియస్‌గా.

సుందర్రావు మోహన్రావు వంక

అనుమాన పూర్వకంగా చూపి, "నీలో ఇంతకు ముందెప్పుడూ ఈ హోమో లక్షణాలు కనిపించలేదే?" అన్నాడు.

"షటప్! నీ ఆలోచనలెప్పుడూ పక్క దారిలోనే నడుస్తాయేంరా, చక్కని రాజమార్గముండగా? నేను, అందంగా లేకపోతే ఆడదాని వైపైనా చూడని నేను, ఓ మగాడి వేపు తదేకంగా అలా చూసి, నీకు చూపించి- ఇదంతా ఎందుకు చేస్తున్నా నంటావ్?"

"అదే....హోమో...."

"నోర్ముయ్! మళ్ళీ అదే కూతా? ఒరేయ్! బుర్ర పెట్టి ఆలోచించరా! అంత అందమైన కుర్రాణ్ని మన బావమరిదిగా ఒక్కసారి-ఒక్క క్షణం వూహించరా" అని అభ్యర్థించాడు మోహన్రావు.

సుందర్రావు బుర్రలో ట్యూబ్ లైట్ తాపీగా వెలిగింది. "ఓహో! వీడే ఇలాఉంటే, వీడికోచెల్లెలుంటే ఆవిడ ఎలా వుండి వుంటుందో నని నీ వూహ? శభాష్! వృద్ధిలోకి రాదగిన వాడివి. కాని, అసలు ఆ అబ్బాయి, వాళ్ళ అమ్మా నాన్నలకీ ఒక్కడే సంతానమేమో కనుక్కు న్నావా?"

"శకున పక్షీ!" అన్నాడు కోపంగా మోహన్రావు. "మా అత్త గారిది చల్లటి కడుపు. మరీ మామ గారి శక్తి సామర్థ్యాల్ని అంత తక్కువగా అంచనా వెయ్యకు. మరీ ఒక్క నలుసుతో ఆపెయ్యడు" అన్నాడు నమ్మకంగా.

"ఓ ఆశావాది మోహన్రావూ! నీ ఆప్టిమిజమ్‌కి నా జోహార్లు! మీ అత్తగారి ఒడి సుక్షేత్రమే, ఒప్పు కుంటాను. కాని వరసగా అయి దారుగురు పుత్రరత్నాల్ని మాత్రమే కందనుకో...."

"తన్నమంటావా, నోరు మూసుకుంటావా? హంసపాదూ!!" అని తిట్టాడు సుందర్రావుని మోహనరావు.

ఆ సమయానికి బ్లూ షర్ట్ కుర్రాడు టిఫిన్ ముగించి కాఫీ త్రాగుతూండడంతో, చేప జారి పోకుండా వల వెయ్యాలనే ఉద్దేశ్యంతో మిత్రులిద్దరూ ఈ టేబుల్ విడిచి ఆ టేబుల్ చేరుకున్నారు.

* * *

ఆ సాయంకాలం తర్వాత అలాంటి సాయంకాలాలు ఇరవై గడిచేలోగా బ్లూషర్టు శ్యామసుంద ర్రావుని 'హల్లో శ్యామ్' అని పిలిచేటంత చనువు సంపాదించారు మిత్రులిద్దరూ. అతడి దగ్గర్నుండి వాళ్ళు సంపాదించిన వివరాల్లో వడగట్టగా పనికొచ్చే విశేషాలు ఇవీ-

శ్యామ్‌కి ఒక్కర్తే చెల్లెలు ఉంది. ఇక్కడ లేదు. లాస్టియరే గుంటూరు మెడికల్ కాలేజీలో చేరింది.

"కాకినాడలో మెడికల్ కాలేజీ ఉండగా గుంటూరులో చేర్పించారా? మీ ఫాదర్‌కి అదేం సరదా?" అనడిగాడు సుందర్రావు శ్యామ్‌ని. 'వెధవ సరదా! బోడి సరదా! హృదయం లేని దుర్మార్గ సరదా! నీచ నికృష్ట సరదా!" అని మనసులో జోడించాడు.

"సరదానా? ఇక్కడ సీటు రాలేదు. గుంటూరులో మా బాబాయి ఉన్నాడ్లే. ఎవరినో ఇన్‌ఫ్లుయెన్స్ చేసి సీటు సంపాదించాడు. వాళ్ళింట్లోనే ఉంటూంది. మా బాబాయే అక్కడ లేకపోతే మా ఫాదర్ మా సుధనక్కడికి పంపడానికి ఒప్పుకోనే ఒప్పుకోరు" అన్నాడు శ్యామ్.

'ఏడిశాడు. అవన్నీ మాకెందుకు?' అని మామగార్నీ, భగవంతుడినీ, విధినీ కలిపి మనసులోనే తిట్టుకున్నారు మిత్రులిద్దరూ. "మా చెవిని వేస్తే, కాకినాడంతా మనదే కదా- ఒక్క సీటు సంపాదించలేకపోయే వాళ్ళమా?" అని వాపోయారు.

"అప్పుడు మీకూ నాకూ పరిచయం లేదు కదా?" అన్నాడు శ్యామ్.

* * *

ఇంకో పదిహేన్రోజుల్లో సుందరావు, మోహన్రావులు శ్యామ్ ఇంటికి భోజనానికి పిలవబడ్డారు. ఒంటరి పక్షులు, హోటల్ భోజన పీడితులు కాబట్టి వెంటనే అంగీకరించారు ఇద్దరూ. అదీగాక శ్యామ్ వాళ్ళింటికి! ఇప్పుడు ఇంట్లో ఆ అమ్మాయి లేకపోయినా, అత్తగారు మామగారితో పరిచయం పెంచుకోవచ్చు కదా! ముందు ముందు పని కొస్తుంది.

"అక్కడ వెధవ్వేషా లెయ్యకు! మర్యాదగా బిహేవ్ చెయ్యి" అని ఆదేశించాడు మోహన్రావు.

"ఇంతకీ...." అని ఆగాడు సుందర్రావు. "ఒక అనుమానం.. అడగనా?" అన్నాడు.

"అడిగెయ్, పోతే పోయింది" అన్నాడు మోహన్రావు.

"ఇప్పుడు వాళ్ళింటికి నాతో బాటు నువ్వు వస్తున్నావా? నీతో బాటు నేను వస్తున్నానా?"

"ఇద్దరం కలిసే వెళ్తున్నాం కదోయ్?"

"అది సరేలే! ఎవరికి సాయంగా ఎవరు వెళ్తున్నారు? ఇంకా డైరెక్ట్‌గా అడగాలంటే మనలో ఎవరు

పెళ్ళి కొడుకు, ఎవరు తోడు పెళ్ళి కొడుకు?" అనుమానం బయట పెట్టేశాడు సుందర్రావు.

"ఓరి ద్రోహీ! ఇన్నాళ్ళూ ఇటు వంటి దురుద్దేశ్యాన్ని మనసులో పెట్టుకున్నావా? శ్యామ్‌ని మొదట చూసింది నేను. అతనికో చెల్లెలుం దేమో, ట్రై చేద్దామన్నది నేను. ఇన్నాళ్ళూ ఇంత ఆసక్తి చూపిస్తు న్నది నేను. మాట సాయానికి నువ్వు వెనక ఉంటావనుకున్నాను గాని, నన్నే వెనక్కి నెట్టేసి నువ్వు ముందు కొచ్చేస్తావా? ఇలాంటి మిత్ర ద్రోహాన్ని మొగ్గలోనే తుంచేయ్" అన్నాడు మోహన్రావు.

"ఈ మాత్రానికే అంత కంగా రెందుకు రా బాబూ! నీ సొమ్ము నేనేం గద్దలా తన్నుకుపోనులే. ఏదో అన్నాను, మాట వరసకి. ఇంతవరకు మనం ఈ విషయం తేల్చుకోలేదు కదా! అందుకని ఒక వేళ నువ్వు ఈ అమ్మాయిని నా కోసమే చూస్తున్నావనుకో, నేనేమో నీ కోసం అనుకుంటున్నా ననుకో...."

"నోర్ముయ్! ఇప్పుడు చెప్పు తున్నాగా-నా కోసమే అని. నువ్వు ఇక ముందైనా ఇలాంటి దురూ హలు చెయ్యడం మానెయ్" అని సలహా ఇచ్చాడు మోహన్రావు.

సుందర్రావు డీలా పడి పోయాడు. 'సుధ! గుంటూరు మెడి కల్ కాలేజీ! శ్యామ్ సిస్టర్!!! బహుశా అతడిలాగే తెల్లగా, పొడుగ్గా, సన్నజాజి మొగ్గలా ఉంటుందేమో! ఆశ వదిలేసుకోవడ మేనా? ఈ మోహన్రావుకి ధారా దత్తం చేసెయ్యడమేనా? వెధవ! అన్ని విషయాల్లోనూ తనని డామి నేట్ చేసేస్తున్నాడు. వీడికంటె ఎక్కువగా తను వాళ్ళని ఆకర్షించ డానికి సాధనం ఏమీ లేదే!'

"అదేం లేదురా! మన మామ గారు- అదే ఐమీన్ మీ మామ గారు, బొత్తిగా ఒక్క ఆడపిల్లనే కనాలా? రెండో కూతురూ ఉండి, ఆ పిల్ల ఈ వూళ్ళోనే ఏ జూని యర్ కాలేజీలోనో చేరి, ఏ ఇంగ్లీష్ లోనో పూర్ అయితే, 'సుందర్రావు గారూ! మీకు టైముంటే, ఏమీ అనుకోకపోతే, కాస్త మా అమ్మా యికి అప్పుడప్పుడు కాస్త ఇంగ్లీషు చెప్పగలరా?' అని మీ మామగారు నో- నో, మన మామగారు నన్ను ప్రాధేయపడితే, మనం చిన్న పోజు కొట్టి అంగీకరించి...."

"సుందర్రావ్- నాయనా సుంద ర్రావూ! కలలు కంటున్నావా బాబూ! ఇదిగో, చెవులు విప్పుకుని శ్రద్ధగా విను. ఆయనకి ఒక్కర్తే

కూతురు. ఆ అమ్మాయీ ఇక్కడ లేదు. గుంటూరులో వుంది. ఆ అమ్మాయిని నేను రిజర్వ్ చేసేసుకున్నాను. అంచేత నువ్వు నీ వాస్తవిక నిరాశాపూరిత, డల్, డిస్కరేజింగ్ ప్రపంచంలోకి వచ్చేయి" అవి సుందర్రావుని మరింత ఉత్సాహంగా నిరుత్సాహ పరిచాడు మోహన్రావు.

"తప్పదు మరి" అన్నాడు సుందర్రావు. "ఇందు మూలంగా నేను చేసే జనాంతిక ప్రకటన ఏమిటంటే, ఈ కేసు నీకు పూర్తిగా ధారాదత్తం చేసేసి ఇకముందు ఆ అమ్మాయిని సోదరీ సమానంగా చూసు కుంటాను. హతవిధీ!" అన్నాడు.

"అదీ బుద్ధిమంతుల లక్షణం. పద, సిగరెట్ కాల్చుకుందాం" అని దారి తీశాడు మోహన్రావు.

"ఒరేయ్ మోహనా! వాళ్ళు మనని భోజనానికి కేకేశారు కదా, కతికితే అతకదంటారు కదా మరి?"

"నీ అనుమానాలు మండిపోనూ? ఈ రోజుల్లో అవేం లేవు. పట్టించుకోకు" అన్నాడు మోహన్రావు.

"సరేగాని, మనం శ్యామ్‌నడిగి ఓ అనుమానం తీర్చు కోవాల్సిందిరా!"

"ఏమిటది మళ్ళీ?"

"ఏం లేదు. సుధకి ఏమైనా మేనరికం ఉందేమో! వాళ్ళ బావ ఏ ఫారినో వెళ్ళాడనుకో. తిరిగి రాగానే...." వాక్యం పూర్తి చెయ్యలేదు సుందర్రావు. తీక్షణంగా చూస్తున్న మోహన్రావు మొహం కేసి చూసి, "సరే- సరే. ఆ అమ్మాయికి బావ లేడు. ఉన్నా కుంటి, గుడ్డి. ఆ అమ్మాయి వాడిని చేసుకోదు. సరేనా?" మిత్రుడ్ని సంతోషపెట్టడానికి ప్రయత్నించాడు.

"నోర్మూసుకుని కాఫీ తాగు" ఆజ్ఞాపించాడు మోహన్రావు.

కాఫీ తాగుతూ మరో అనుమానపిశాచాన్ని బయట పెట్టాడు సుందర్రావు. "ఇదిగో, అలా చూడకు. ఇది జెన్యూయిన్, ప్రోపర్ అనుమానం. నీకు చాలా పనికొచ్చే అనుమానం. విను! శ్యామ్ లాగే వాళ్ళ మదర్ అందంగా ఉందనుకో. అంటే ఫెయిర్ కాంప్లెక్షన్, మంచి ఫీచర్స్ ఎట్ సెట్రా.... మనవాడికి వాళ్ళమ్మ పోలిక వచ్చిందనుకో... కాని వాళ్ళ నాన్న నల్లగా జీడిగింజలా ఉంటాడనుకో, అసహ్యంగా అందవిహీనంగా ఉంటాడనుకో. ఆ అమ్మాయికి వాళ్ళ నాన్న పోలిక వచ్చిందనుకో...."

"ఆపు- అపరా వెధవా! నేనిక వినలేను. అసలు ఇలాంటి అప

భ్రంశపు ఆలోచనలు ఎలా వస్తాయి రా నీకు? నీ మెదడు డిసెక్ట్ చేసి చూస్తే ఏదైనా స్ట్రక్చరల్ డిఫెక్ట్ కనిపిస్తుందేమో అందులో! ఏదీ సవ్యంగా ఆలోచించవు కదా! శుభం కోరరా పెళ్ళికొడుకా అంటే అని ఏదో సామెత ఉందిలే...." మోహన్రావు నానా హైరానా పడి పోతున్నాడు.

"ఔన్లే. నీ మేలు కోరి ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్త కోసం చెపుతుంటే నువ్వెందుకు వింటావు? ఏం, నేను చెప్పినట్టు జరిగే అవకాశం లేదా?" మిత్రుడిని ఇరిటేట్ చేసి ఆనందిస్తున్నాడు సుందర్రావు.

"ఉందిలే. అయితే మాత్రం మొదటినుంచీ రాంగ్ సైడ్‌లో ఎందుకు ఆలోచించాలి మనం? లెటజ్ హోప్ ఫర్ ది బెస్ట్!"

"కానీ కీడెంచి మేలెంచడం మంచిది కదరా!"

"తంతాను. మరి నువ్వు నాకు సలహాలివ్వకు. నాకు పిచ్చెక్కి పోతూంది."

"సరే, నీ ఖర్మ. పోనీ.... ఒక్క సలహా. ఆఖరు సలహా.... నీ మేలుకోరి, మిత్రుడిగా, మంచి మనసుతో...."

"ఊఁ, సర్లే. ఊక దంపుడు మాని అదేమిటో సరిగ్గా చెప్పి చావు!" విసుగ్గా అన్నాడు మోహన్రావు సుందర్రావుతో.

"రేపు వాళ్ళింటికి వెళ్ళినప్పుడు గోడల మీద ఫోటోలు చూడు, లేదా శ్యామ్‌ని వాళ్ళింటి ఆల్బమ్ ఏదైనా ఉందేమో చూపించమను కాజువల్‌గా. అందులో తప్పేం లేదు. ఆ ఆల్బంలో ఆ అమ్మాయి ఫోటో ఉండక పోదు. అటో ఇటో తేలిపోతుంది."

"ఎలాగైతేనేం- ఇన్నేళ్ళకి నీ బుర్ర పొరపాటున సరిగానే పని చేసింది. థాంక్స్! మంచి సలహాయే ఇచ్చావు. అలాగే చేద్దాం" అన్నాడు మోహన్రావు.

* * *

ఆ రోజు వచ్చింది, వెళ్ళింది. ఇద్దరూ వాళ్ళింటికి వెళ్ళారు, వచ్చారు. శ్యామ్ తల్లిదండ్రులిద్దరూ వీళ్ళ వినయం, వందనం, అదీ ఇదీ చూసి ముచ్చట పడ్డారు. శ్యామ్ తండ్రి కూడా, నల్లగా జీడి గింజలాకాక, బాగానే ఉన్నాడు. ఫర వాలేదనుకున్నారు మిత్రు లిద్దరూ. తల్లిదండ్రులిద్దరూ బాగానే ఉంటే కూతురు అందహీనంగా ఉండ డానికి అవకాశం లేదు. అంతా సరదాగా భోజనాలు చేశారు. వీళ్ళి ద్దరి ఉద్యోగాలు, హోటల్ భోజనం, స్వస్థలాలు, తల్లిదండ్రులూ-అన్నీ అడిగి తెలుసుకున్నారు. అంత వరకు బాగానే వుంది.

భోజనాలయ్యాక సుందర్రావు

సూచన ననుసరించి ఆల్బం అడిగాడు మోహన్రావు. తెచ్చిచ్చాడు శ్యామ్. ఐతే అందులో ఫోటోలు నాలుగేళ్ళ క్రిందటే ఆగిపోయాయి. ఆఖరు ఫోటో-సుధ, మరో ముగ్గురు స్నేహితురాళ్ళు కలిసి సెన్త్ క్లాస్ పాసయ్యాక తీయించుకున్నది. "ఇదిగో మా చెల్లాయి" అని చూపించాడు శ్యామ్. బాగుంది. ఆ నలుగురిలోనూ ఆ అమ్మాయే బాగుంది.

"మరి ఈమధ్య ఫోటోలేవీ లేవా?" అడిగాడు మోహన్రావు.

వాళ్ళమ్మగారు సమాధానం చెప్పారు, కొంచెం విచారంగా. "ఆ సెన్త్ క్లాస్ పాసయ్యాక దానికి మశూచికం పోసింది నాయనా! 20 రోజులు మంచంలోనే ఉండిపోయింది. తర్వాత కోలుకుందిగాని మొహం మీద మచ్చలు మాత్రం పోలేదు. అందుకని తర్వాత ఎప్పుడూ ఫోటోలు తీయించుకోవాలంటే అది ముందుకొచ్చేది కాదు. ఏదో వంకతో వద్దనేసేది. మేమూ దాన్ని బలవంత పెట్టలేదు. మాకూ ఫోటోల్లో ఆసక్తి చచ్చిపోయింది."

మిత్రులిద్దరికీ ఉత్సాహభంగం కలిగింది. మొహంమీద స్ఫోటకం మచ్చలా? మరోసారి ఆల్బంలో ఫోటోకేసి చూసారు. చక్కటి పిల్ల! ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

ఇంకేవో కబుర్లు, కాఫీలు అయ్యాక లేచి వచ్చేశారు.

* * *

ఆ సాయంకాలం చాలా డిస్కషన్ జరిగింది ఇద్దరి మధ్యా.

"మర్చిపో!" అన్నాడు సుందర్రావు.

"అంతేనా?" అన్నాడు మోహనరావు ఆలోచిస్తూ.

"తప్పదు. నీకా అమ్మాయి గురించి ఏం తెలుసు? ఏమీ తెలీదు. కాని ఎందుకు ఎగబడ్డావు? అందంగా వుంటుందేమోనన్న ఆశతో. అదీ లేదని తేలిపోయింది. ఇంకెందుకు ప్రాకులాడడం?"

మోహన్రావు ఆలోచిస్తున్నాడు.

"సారీ! బెటర్ లక్ నెక్స్ట్ టైమ్. ఈసారి ఇలాంటివన్నీ ముందే తెలుసుకుని మరీ దిగుదాం రంగంలోకి...."

"మళ్ళీ ఈసారి కూడా నువ్వు నాతో పోటీ పడతావా? వెధవా! నీ జోక్యం వల్లనే ఈ కేసు ఇలా అయింది" అన్నాడు మోహన్రావు.

"ఎంత మాట గురూ! చెప్పేను కదా, నువ్వు చూసిన అమ్మాయిని నేను సిస్టర్లా చూసుకుంటానని! లాస్ట్‌వీక్ మనిద్దరం మీ వూరు

వెళ్ళి వచ్చినప్పటినుంచి ఈ నిశ్చయం మరీ గట్టిపడింది నాలో!"

"అదేమిటి?" అన్నాడు మోహన్రావు ఆశ్చర్యంగా. "మనం మా వూరెళ్ళినప్పుడు దీనికి సంబంధించిన ప్రసక్తి ఏమీ రాలేదే?" అన్నాడు.

"అది కాదు...." నసుగుతూ అన్నాడు సుందర్రావు. "నీ కేసు నాకు చెల్లెలితోసమానం. కనక...."

"కనక? నాన్చక చెప్పు!"

"నీ సంగతి ఎలాగూ ఇలా అయింది. కాస్త నా విషయం అయినా...."

"నీ విషయమేమిటి మధ్యలో?"

"అదే-మీ సిస్టర్ మొన్న....మీ ఇంటికొచ్చినప్పుడు చూశాను. నన్ను అపార్థం చేసుకోకు. మీ వూరెళ్ళినప్పటినుంచి నీతో ఎలా చెప్పాలా అని..నువ్వు నాకు అన్యాయం చెయ్యవు, నాకు తెలుసు.... యు ఆర్ ఎ ట్రూ ఫ్రెండ్! నన్ను స్వంత బావమరదిలా చూసుకుని...." *

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.